ప్రభాకర్ గుంటూరులో సాధారణ జనంలాగే నలుగురిలో తిరుగుతూ.. పార్టీ పనుల్లో నిమగ్నమయ్యాడు. నల్లమలలో ఉద్యమాన్ని నిర్మిస్తూ అడవిలో తలదాచుకుంటున్న వారికి కావాల్సిన ఏర్పాట్లను చూసుకుంటున్నాడు. తిండి సామగ్రి, మందులు, టెంట్లు, డ్రెస్సులు చాటుమాటుగా అందజేయడం ఆయన పని.

ఓ రోజు సరుకులు కొంటుండగా..

''ఇంతేసి పచారు సామాను తీసుకుంటావబ్బీ.. హాస్టల్ గానీ నడుపుతున్నావా?'' అన్నాడు కిరాణా కొట్టు యజమాని.. ప్రభాకర్‌తో!

టక్కున.. లేదన్నట్లు తల అడ్డమూపాడు ప్రభాకర్.

''మరి?!'' అన్నాడు కొట్టాయన.

ఆయనకు ఏదో సర్ది చెప్పాల్సిన చోట.. 'నీకెందుకయ్యా!?' అన్నట్లు ముఖం పెట్టాడు ప్రభాకర్.

దుకాణదారు మంచివాడిలా ఉన్నాడని ఒకేచోట కొంటుంటే.. ఊహించని చిక్కుప్రశ్న ఎదుర్కోవాల్సి వచ్చింది. మరో మార్కెట్ పక్క వీధిలో ఉన్నందున.. ఒక్క వస్తువు కోసం అంతదూరం వెళ్లడమెందుకని, వేరే దుకాణానికి వెళ్లాడు.



దుకాణదారు మంచివాడిలా ఉన్నాడని ఒకేచోట కొంటుంటే.. ఊహించని చిక్కుప్రశ్న ఎదుర్కోవాల్సి వచ్చింది. మరో మార్కెట్ పక్క వీధిలో ఉన్నందున.. ఒక్క వస్తువు కోసం అంతదూరం వెళ్లడమెందుకని, వేరే దుకాణానికి వెళ్లాడు. అది చూసిన పాత కొట్టాయన ఓ కస్టమరుతో.. ''చూశారండీ చోద్యం! 'ఇంతేసి దినుసు కొంటావు. హాస్టల్ గానీ ఉందా!?' అన్నందుకే మరో దుకాణానికి వెళ్లాడా బాబు!'' అని వేలెత్తి చూపించాడు.

ఆయన వెంటనే..

''ఏ ఊరు ఆయనది?'' అని అడిగాడు.

''ఏమో! బయటాయనే కాబోలు.. కొత్తగా కనిపిస్తున్నాడు'' అని జవాబిచ్చాడు కొట్టు ఆసామి.

ఆ కస్టమరు.. మఫ్టీ పోలీసు.

వార్త డిపార్ట్‌మెంట్‌కు చేరింది. ప్రభాకర్‌పై నిఘా మొదలైంది. వారం రోజులుగా ఆయన కదలికల్ని పసిగడుతూ.. వెంటాడుతూ అమ్రాబాద్ దగ్గర సున్నిపెంటలోని ఓ గుడిసెను చుట్టుముట్టిన స్పెషల్ ఫోర్స్ జరిపిన కాల్పుల్లో.. నలుగురు దళ సభ్యులతోపాటు తూటా తగిలి ప్రభాకర్ ప్రాణాలు కూడా గాలిలో కలిసిపోయాయి. అలా పార్టీలో చేరిన రెండేళ్లకే ప్రభాకర్ పేరు దళసభ్యుడిగా అమరుల్లో కలిసిపోయింది. పోలీసుల వెంట వచ్చిన ప్రభాకర్ తల్లి.. చాపలో చుట్టి ఉన్న కొడుకును చూసి నేలపై కూలిపోయి, నెత్తీ నోరూ కొట్టుకొంటూ ఏడ్చింది. కొడుకును గుర్తు చేసుకుంటూ రోజూ ఏడ్చి ఏడ్చి.. చివరికి కొడుకు ఫొటోను చూస్తూ బతకడం అలవాటు చేసుకుంది.

పెరిగిన నిర్బంధంలో పార్టీ కదలికలు కనాకష్టమయ్యాయి.

ఓ రోజు బస్సునాపి వెతుకుతున్న పోలీసులకు.. పార్టీ పత్రికలతో దొరికిపోయాడు ప్రకాశ్. ఎంత హింసించినా తనకు ప్రెస్సు, పత్రికలు తప్ప వేరే ఏదీ తెలియదన్నాడు. పత్రికతో సంబంధం ఉన్నవాళ్లను పట్టుకొచ్చారు. వారితోపాటు ప్రకాశ్ కూడా ఖైదీగా జైలుకెళ్లాడు. కోర్టులో పోలీసులు కేసు వేస్తే.. పత్రిక నడపడంలో, దాన్ని చదవడంలో తప్పేముందని జడ్జీ కేసును కొట్టేశారు. అలా ప్రకాశ్ బతికి బయటపడ్డాడు. మళ్లీ పార్టీ వైపు వెళ్లకుండా.. వరంగల్‌లో ఓ స్కూల్ తెరిచాడు. తన తెలివినంతా ఉపయోగించి విద్యా వ్యాపారాన్ని పెంచి పెరిగిపోయాడు.

క్రాంతి విద్యా సంస్థలు పేరిట వరంగల్‌లో, హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ కాలేజీలు తెరిచాడు. రాజకీయంగా కూడా పలుకుబడి పెంచుకున్న ఆయన్ను ఎమ్మెల్సీ పదవి కూడా వరించింది.

బుద్ధిగా చదువుకున్న రామస్వామి లెక్చరర్‌గా జీవితాన్ని ఆరంభించి, పీహెచ్‌డీ పూర్తిచేసి.. యూనివర్సిటీలో ప్రొఫెసర్ అయ్యాడు. తన కాలేజీ మిత్రుడు ప్రకాశ్ ఎమ్మెల్సీ అయిన వార్త పత్రికలో చదివి.. రామస్వామి తెగ సంబురపడి పోయాడు. తాము కలిసి చదివిన కాలేజీలో ప్రకాశ్‌కు సన్మానం చేయాలని రామస్వామి ఆ బ్యాచ్ వాళ్లను ఏకం చేశాడు. ఆహ్వానించగానే ప్రకాశ్ ఉత్సాహంగా వచ్చాడు. ఘన సన్మానానికి ఎమ్మెల్సీ ప్రకాశ్ ఉప్పొంగిపోయి.. పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపాడు.

భోజనాలు అయ్యాక పక్క పక్కనే కూర్చున్న ఇద్దరు మిత్రుల మనసులు.. బహుశా ఒకే ఆలోచనలో ఉండొచ్చు. ఇంకొద్ది సేపట్లో ఎవరి దారి వారు చూసుకుంటారు. చివరికి రామస్వామి..

'అడగాలా వద్దా!?' అనుకుంటూనే.. ఆపుకోలేక..

''ప్రకాశ్ గారు.. మీకు మన ప్రభాకర్ గుర్తున్నాడా!'' అనేశాడు.

ఏ నిమిషంలోనైనా రామస్వామి నోట ఈ ప్రశ్న వచ్చి తీరుతుందని ప్రకాశ్‌కూ తెలుసు. అంతా గుర్తున్నా గుర్తుకు రానట్లు అడ్డంగా తల ఊపాడు.

''అదే.. మన.. పార్టీ..'' అని గుర్తుకు తెచ్చేందుకు మరింత ప్రయత్నం చేశాడు రామస్వామి.

ఆయన యాతన పడలేక..

''చూడు స్వామి! నేను ఇప్పుడేమిటో నీకు స్పష్టంగా తెలుసు. నీ సంగతేమో గానీ, నేను మాత్రం పార్టీ వైపు వెళ్లక చాలా ఏండ్లయింది. ఆ రోజులన్నీ నేను పూర్తిగా మరిచిపోయాను. దాని జోలి మళ్లీ నా దగ్గర తీసుకు రాకు'' అన్నాడు విసుగ్గా.

''ఛ.. ఛ! నేను కూడా మీలాగే! దూరమే! ఏదో కాలేజీ రోజులు..'' అంటూ ఇంకేదో అనబోయి, ఆ ప్రస్తావన ఆపేశాడు.

ఎదుగుతున్న మనిషికి దూరం కావద్దనే అంతర్బోధతో తనను మన్నించమన్నట్లు రామస్వామి చేతులు జోడించాడు.

తన దారిలోకి వచ్చిన రామస్వామి ఇంకెందుకు పనికొస్తాడు అనుకున్న ప్రకాశ్..

''స్వామీ! రిటైర్మెంట్ తర్వాత కలువు. మన కాలేజీల్లో ఏదైనా మంచి పొజిషన్ తీసుకుందువు'' అన్నాడు.

''మా అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ యూఎస్‌లో ఉంటారు. ముందు వాళ్ల దగ్గరికి వెళ్లాలి'' అన్నాడు రామస్వామి.

ఆ సమాధానం ప్రకాశ్‌కు రుచించలేదు. అమెరికా యాత్రికులను నమ్మితే పనులు కావనిపించి..

''వస్తాను! థాంక్యూ వెరీమచ్!'' అంటూ సెలవు తీసుకున్నాడు.

ఆ రాత్రివేళ తిరుగు ప్రయాణం అవుతున్న ప్రకాశ్ కారు.. ప్రభాకర్ ఇంటి ముందు నుంచే వెళ్తున్నది. ఏదో గుర్తొచ్చినట్లు.. ప్రకాశ్ కళ్లు దర్వాజలోంచి ఆ ఇంటి లోపలికి తొంగి చూశాయి.

గుడ్డి దీపం వెలుగులో బీడీలు చుడుతున్న తల్లి వెనుకాల.. గోడపై పూలదండ వేసిన ప్రభాకర్ ఫొటో కనిపించింది. ఇల్లు దాటగానే వెనుక నుంచి ఎవరో తననే పేరు పెట్టి పిలుస్తున్నట్లు.. వెంటపడి వస్తున్నట్లు ప్రకాశ్‌కు అనిపించింది. తల తిప్పకుండానే డ్రైవర్‌తో..

''స్పీడు పెంచవయ్యా!'' అని చేతులతో ముఖం దాచుకున్నాడు.

భయానికో, బాధకో వచ్చిన కన్నీళ్లతో ఆయన అరచేతులు తడిస్తే.. పక్కనున్న తువ్వాలుకు తుడుచుకున్నాడు.

తన రిటైర్మెంట్ సభకు రమ్మని ఎమ్మెల్సీ ప్రకాశ్‌ను రామస్వామి పిలిస్తే.. ఏదో ముఖ్యమైన పనుందని చెప్పి రాలేనన్నాడు. ఈ నాయకులతో తనకు కుదరదని ఆయనకు అర్థమైంది. పనులన్నీ ముగించుకొని విశ్రాంత జీవితానికి హంగులు అద్దేలా రామస్వామి అమెరికాకు పయనమయ్యాడు. ■

## బద్రి నర్సన్



చుట్టూ ఉన్న సమాజాన్ని అక్షరీకరించి.. తన రచనల ద్వారా ప్రపంచానికి చూపుతారు బద్రి నర్సన్. రచయితగా, కాలమిస్ట్‌గా తెలంగాణ సమాజానికి సుపరిచితులు. స్వస్థలం జగిత్యాల. డిగ్రీ వరకూ అక్కడే చదువుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ, ఎంఎడ్ పట్టా పుచ్చుకున్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఉద్యోగం చేసి, 2015లో పదవీ విరమణ పొందారు. పాఠశాల స్థాయినుంచే సాహిత్యాభిలాష పెంచుకున్నారు. బాల్య మిత్రులతో కలిసి 'సాహితీ మిత్ర దీప్తి' అనే సంస్థ ద్వారా కవిత, కథల పోటీలు నిర్వహించారు. ఎంపికైన రచనలను పుస్తకాలుగా తీసుకొచ్చారు. ఉద్యోగంలో చేరడానికి ముందు.. రంగుల కల, విముక్తికోసం సినిమాల్లో రచన, దర్శకత్వ శాఖల్లో పనిచేశారు. గత కొన్నేళ్లుగా వివిధ అంశాలపై పత్రికలకు వ్యాసాలు, పుస్తక సమీక్షలుగా రచనా వ్యాసంగం చేస్తున్నారు. ఈ క్రమంలోనే యాభైకి పైగా కథలు రాశారు. 'ఓ రైతు కథ'కు నోముల సత్యనారాయణ పురస్కారం, నవతెలంగాణ కథల పోటీల్లో ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. పాలపిట్ట – శకుంతల జైని దసరా కథల పోటీలో 'రబ్బరు బొమ్మ'కు ప్రథమ బహుమతి దక్కింది. ఇలాగే మరికొన్ని కథలూ బహుమతులు పొందాయి.